కూలిన బ్రిడ్జిని పరిశీలిస్తున్న నాయకులు ప్రభాకర్‌రెడ్డి, గౌస్‌దేశాయి, రాధాకృష్ణ, తదితరులు

నేడే తీర్పు

- కౌంటింగ్‌కు సర్వం సిద్ధం
- తేలనున్న విజేతలు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల్లో ఓటరు తీర్పు మంగళవారం వెలువడనుంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని రెండు పార్లమెంట్ స్థానాలు, 14 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ నిర్వహించగా మంగళవారం ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. కౌంటింగ్‌కు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు..

ఉమ్మడి కర్నూలు జిల్లాలోని రెండు పార్లమెంట్ స్థానాలు, 14 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ నిర్వహించగా మంగళవారం ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఓట్ల లెక్కింపు కోసం అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. కర్నూలు పార్లమెంటు, ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల కౌంటింగ్ కోసం రాయలసీమ యూనివర్సిటీలోని లైఫ్ సైన్సెస్ బ్లాక్‌లోని మూడవ అంతస్తులో కర్నూలు, నాలుగవ అంతస్తులో ఆదోని, లైబ్రరీ బ్లాక్‌లోని మొదటి అంతస్తులో మంత్రాలయం, మూడవ అంతస్తులో పత్తికొండ, ఇంజనీరింగ్ బ్లాక్‌లోని మొదటి అంతస్తులో పాణ్యం, రెండవ అంతస్తులో ఆలూరు, మూడవ అంతస్తులో కోడుమూరు, నాలుగవ అంతస్తులో ఎమ్మిగనూరు నియోజకవర్గాలకు సంబంధించిన కౌంటింగ్ హాల్‌లను ఏర్పాటు చేశారు. నంద్యాల పట్టణ శివారు ప్రాంతంలోని ఆర్జిఎం ఇంజనీరింగ్ కాలేజీలో నందికొట్కూరు, శ్రీశైలం అసెంబ్లీ నియోజకవర్గాలు, శాంతిరాం ఇంజనీరింగ్ కాలేజీలో నంద్యాల, ఆళ్లగడ్డ, బనగానపల్లి అసెంబ్లీ నియోజకవర్గాలు, ఫార్మసీ కాలేజీలో డోన్ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. తొలుత ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు ప్రారంభించనున్నారు. 8.30 గంటలకు ఇవిఎంల ఓట్ల లెక్కింపు ప్రారంభించనున్నారు. కర్నూలు జిల్లాలో ప్రతి కౌంటింగ్ హాల్ లో కౌంటింగ్ నిర్వహణకు 14 కౌంటింగ్ టేబుల్స్ ఏర్పాటు చేశారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు మంత్రాలయం 17 రౌండ్లలో, కర్నూలు, పత్తికొండ, ఆదోని 19 రౌండ్లలో, ఎమ్మిగనూరు, కోడుమూరు 20 రౌండ్లలో, ఆలూరు 21 రౌండ్లలో, పాణ్యం 26 రౌండ్లతో పూర్తి కానుంది. కౌంటింగ్ కోసం అడిషనల్ ఏఆర్ఓలు, కౌంటింగ్ సూపర్వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లను నియమించారు. నంద్యాల జిల్లాలో ప్రతి నియోజకవర్గానికి అసెంబ్లీ సెగ్మెంట్ కు ఒక కౌంటింగ్ హాలు, పార్లమెంటు సెగ్మెంట్ కు మరొక కౌంటింగ్ హాల్ చొప్పున 12 కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. నంద్యాల పార్లమెంట్ పోస్టల్ బ్యాలెట్ కోసం ప్రత్యేకంగా మరొక కౌంటింగ్ హాల్‌ను కూడా సిద్ధం చేశారు. ప్రతి హాల్‌కు 14 టేబుల్స్ చొప్పున ఓట్లను లెక్కించనున్నారు. ఇవిఎంల ఓట్ల లెక్కింపు కోసం అసెంబ్లీకి 74 టేబుళ్ళు, పార్లమెంటుకు 75 టేబుళ్ళు, పోస్టల్ ఓట్ల లెక్కింపు కోసం అసెంబ్లీకి 21 టేబుళ్లు, పార్లమెంటుకు 17 టేబుళ్ల చొప్పున ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఆళ్లగడ్డ అసెంబ్లీ ఓట్ల లెక్కింపు 22 రౌండ్లలో, శ్రీశైలం 17 రౌండ్లలో, నందికొట్కూరు 18 రౌండ్లలో, నంద్యాల 21 రౌండ్లలో, బనగానపల్లె 20 రౌండ్లలో, డోన్ 21 రౌండ్లలో పూర్తి కానుంది. ఓట్ల లెక్కింపుతో జిల్లాలోని రెండు పార్లమెంట్ స్థానాలు, 14 అసెంబ్లీ స్థానాల్లో విజేతలు ఎవరనేది తేలనుంది. మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 6 మధ్య అన్ని నియోజకవర్గాల ఫలితాలు వెల్లడికానున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

పటిష్ట బందోబస్తు

ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. కర్నూలు కౌంటింగ్ హాల్‌ల వద్ద 72 సిపిఎఫ్, 70 ఎస్‌పి, 391 సివిల్ పోలీసు సిబ్బందితో మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. కౌంటింగ్ పరిసరాల పరిధిలో ఈ నెల 7 వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. నంద్యాల ఎన్నికల కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎస్పీ, ఒక అదనపు ఎస్పీ, నలుగురు డిఎస్‌పిలు, 23 మంది సిఐలు, 35 మంది ఎస్ఐలు, 68 మంది ఎఎస్ఐలు, 133 మంది కానిస్టేబుళ్ళు, 101 మంది హోంగార్డులతో పాటు స్పెషల్ పార్టీ, బిఎస్ఎఫ్ బలగాలు, ఎఆర్, ఎపిఎస్‌పి సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లాలోని 75 సమస్యాత్మక ప్రాంతాలలో పోలీసు పికెట్‌లు ఏర్పాటు చేశారు.

బ్రిడ్జి నిర్మాణం వెంటనే చేపట్టాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రభాకర్ రెడ్డి
- కూలిన బ్రిడ్జిని పరిశీలించిన సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు నుండి ఉల్చాల గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిలో వాగు దగ్గర కూలిన బ్రిడ్జిపై శాశ్వతమైన బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కె.ప్రభాకర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, కార్యదర్శి వర్గ సభ్యులు పిఎస్.రాధాకృష్ణ, మండల నాయకులు ఆంజనేయులు, శ్రీనివాసరెడ్డి, రాఘవేంద్రలతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడారు. కర్నూలు మండలం ఉల్చాల గ్రామం కర్నూలు నగరానికి కూత వేటు దూరంలో ఉందని, ఆ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి రేమట, కొత్తకోట, సుంకేసుల, గ్రామాలకు ప్రధాన రహదారిగా ఉందని అన్నారు. ప్రతిరోజు ఈ రహదారిలో వందలాది మంది ప్రజలు ప్రయాణాలు చేస్తున్నారని తెలిపారు. ఈ కూలిపోయే స్థితిలో ఉన్న బ్రిడ్జిని పూర్తిగా తొలగించి శాశ్వతమైన కొత్త బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలన్నారు. గత నాలుగైదు సంవత్సరాల నుండి ఈ ప్రాంతాల ప్రజలు కోరుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం ప్రభుత్వానికి ప్రజలపై ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తుందన్నారు. ప్రతిరోజు ఇదే దారిలో ప్రయాణించే అధికారులు గ్రామ ప్రజా ప్రతినిధులు ఈ సమస్యను గుర్తించకపోవడం శాశ్వత పరిష్కారం చూపకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉంచాల గ్రామం నుండి నాగులాపురానికి వెళ్లే దారిలో వాగు ఉధృతికి బ్రిడ్జి మొత్తం కొట్టుకుపోయిందని ప్రజల్లో ఆరా తీయగా గత నాలుగు నెలల క్రితమే వేశారని చెబుతున్నారని. నాలుగు నెలల క్రితం వేసిన బ్రిడ్జి చిన్నపాటి నీటి ఉధృతికే కొట్టుకపోవడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయి మాట్లాడుతూ ఈరోజు కూలిన బ్రిడ్జి దగ్గర వేసిన మట్టిని చూస్తే ప్రజల రక్షణ కోసం వేశారా ప్రజలను ఆపదలోకి నెట్టి వేయడం కోసం వేశారా అని అర్థం కావడం లేదన్నారు. చిన్న చిన్న బ్రిడ్జి నిర్మాణాలు కూడా చేయలేని ప్రభుత్వాలు ప్రజాప్రతినిధులు ఈ సమాజంలో ఉండడం మన దురదృష్టం అని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు చిత్తశుద్ధి ఉంటే బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు రహదారి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు రాఘవేంద్ర,ఆంజనేయులు, శ్రీనివాసరెడ్డి ,ప్రవీణ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు అంజి, రాము, హరి, రాజు, శివ, తిరుమల్,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

హైవేలపై టోల్ బాదుడు

- టోల్ చార్జీలు 3 నుంచి 5 శాతం పెంపు
- టోల్‌గేట్ పెంపుతో ప్రజలపై భారం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

దేశవ్యాప్తంగా టోల్‌గేట్ ఛార్జీలు మూడు నుంచి ఐదు శాతం పెంచుతున్నట్లు కేంద్రం ప్రకటించింది. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని టోల్ ఛార్జీల పెంపును వాయిదా వేసిన కేంద్ర ఎన్నికలు ముగియడంతో ఈ నెల 3 నుంచి పెంచుతూ ఆదేశాలు జారీ చేసింది. దేశంలో టోల్ ఛార్జీలు ద్రవ్యోల్బణానికి అనుగుణంగా ఏటా సవరిస్తున్నారు. సోమవారం నుండి దేశంలో దాదాపు 1,100 టోల్ ప్లాజాల వద్ద పెంచిన ఛార్జీలను వసూలు చేయనున్నట్లు హైవే ఆపరేటర్లు ఇప్పటికే ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం ఎన్నికల్లో లబ్ధి పొందడానికి ఎన్నికల వరకు ఉండి చివరి దశ ఎన్నికలు పూర్తయిన వెంటనే వినియోగదారు రుసుం రేట్ల సవరణ ప్రభుత్వం అమలులోకి తెచ్చింది. టోల్ ఛార్జీల పెంపుతో రవాణా రంగంపై పెను ప్రభావం పడుతుందని, ఇప్పటికే గ్రీన్ టాక్స్ పేరుతో, ఓవర్ లోడ్ పేరుతో వేసిన అధిక చలానాలు చెల్లించలేక వాహన యజమానులు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని, ఇవి చాలవన్నట్లు మూడు నుంచి ఐదు శాతం ఇప్పుడున్న టోల్గేట్ చార్జీలకు అధానంగా పెంచారు. ఐఆర్‌బి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలపర్స్, అశోక్ బిల్డ్‌కాన్ లిమిటెడ్ కార్పొరేట్ కంపెనీల వంటి ఆపరేటర్లు టోల్ పెంపు వల్ల భారీగా లాభాలు పొందుతారు. రవాణా రంగంపై, సామాన్యులపై ఈ పెంపు తీవ్ర ప్రభావం చూపుతోంది. 2018-19లో టోల్ వసూళ్లు రూ.2,520 కోట్లు ఉండగా, 2022-23 నాటికి రూ.5,400 కోట్లకు పెరిగింది. ఇప్పుడు పెరిగిన టోల్ చార్జీల వల్ల రూ.లక్షలాది కోట్లుబడా కంపెనీలు లాభపడతాయి. ప్రభుత్వం పెంచిన టోల్ ఛార్జీలను తక్షణమే ఉపసంహరించుకోవాలని వాహనదారులు, ప్రజాసంఘాల నాయకులు కోరుతున్నారు. లేకుంటే ఆందోళనలు చేపడతామంటున్నారు.

రవాణా రంగంపై ఆర్థిక దెబ్బ

- ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్

దెబ్బ మీద దెబ్బ ఇదేమి అబ్బ అన్నట్లు ట్రాన్స్‌పోర్టు రంగంపై పెట్రోల్ ,డీజిల్ ధరలు పెంచుతూ దానికి తోడుగా టోల్గేట్ చార్జీలను కూడా పెంచడంతో ట్రాన్స్‌పోర్ట్ రంగంలో పనిచేసే వారందరికీ భారీగా దెబ్బ పడ్డట్టు అయింది. పెంచిన టోల్ గేట్ చార్జీలను వెంటనే తగ్గించి ట్రాన్స్‌పోర్ట్ రంగాన్ని ఆదుకోవాలి. తగ్గించని పక్షంలో ట్రాన్స్‌పోర్ట్ రంగ కార్మికులతో భారీ ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టాల్సి వస్తుంది.

పరోక్షంగా ప్రజలపై భారం

- సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ

టోల్గేట్ చార్జీలు పెంచడంతో పరోక్షంగా సామాన్య ప్రజలపై భారం పడనుంది. రవాణా రంగంలో ఉన్న ప్రధాన ప్రజారవాణా, వస్తురవాణా, లాంటివి కీలకం. టోల్గేట్ పెంచడంతో ఆ భారాన్ని ట్రాన్స్‌ఫర్ చేసే వ్యక్తులపై కూడా పడనుంది. ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా రవాణా రంగంలో పనిచేసేవారు. విధిలేని పరిస్థితిలో రవాణా సరుకులపైన, ప్రయాణ చార్జీల పైన కూడా చార్జీలు పెంచే అవకాశం ఉంది. ఏ ప్రభుత్వం వచ్చినా ఏమున్నది గర్వకారణం. రవాణా చేసే ప్రతి వస్తువుపై చార్జీలు పెంచే అవకాశం ఉంది.ప్రభుత్వం పునరాలోచించి పెంచిన చార్జీలను తగ్గించాలి.

నైరుతి ప్రభావంతో

విస్తారంగా వర్షం

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

జిల్లా వ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు ఊపందుకున్నాయి. జూన్ మొదటి వారంలోనే నైరుతి రుతుపవనాల ప్రభావంతో వర్షాలు ప్రారంభమయ్యాయి. వర్షాలు కురవడం రైతాంగంలో నూతనోత్సాహం నింపుతుంది. సాధారణ వర్షపాతంలో ఒకేసారి సగం కురవడం రైతుల ఆశలు మరింత చిగురించాయి. జూన్‌లో సాధారణంగా వర్షపాతం 77.7 మిల్లీమీటర్ల కురవా.అయితే మొదటి వారంలోనే 34.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయింది. నైరుతి రుతుపవనాలతో మూడు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ అధికారులు తెలుపుతున్నారు. జిల్లాలో అత్యధికంగా ఎమ్మిగనూరులో 69.2 మిల్లీమీటర్లు, అత్యాలపంగా కోసిగిలో 8.4 మిల్లీమీటర్లు వర్షం నమోదు అయింది. ఈ వర్షపాతం నమోదు మరింత పెరుగుతుందని సాధారణ వర్షపాతం కంటే అత్యధికంగా పెరుగుతుందని అధికారులు పేర్కొంటున్నారు. దీంతో జిల్లాలో రైతులు విత్తన సాగు మొదలు పెట్టనున్నారు. మొదటగా పత్తి, మొక్కజొన్న, సాగు కానుందని తగిన సౌకర్యాలు ఆర్‌బికేలలో కల్పించామని వ్యవసాయ అధికారులు తెలిపారు. రైతులు విత్తనాలు ఎరువులు సంబంధించి ఆర్‌బికెల లో వ్యవసాయ అధికారులను సంప్రదించాలని వ్యవసాయ జిల్లా అధికారి పిఎల్.వరలక్ష్మి తెలిపారు. జిల్లాలో కర్నూలు అర్బన్ 67.4, కల్లూరు 65.6, హాలహర్వి 64.6,కర్నూలు రూరల్ 51.2,ఆలూరు 47.4,గూడూరు 45.6,తుగ్గలి 44.6,ఓర్వకల్ 43.2,కోడుమూరు 43.2,చిప్పగిరి 39.8, గోనెగండ్ల 34.2,మంత్రాలయం 30.8,మద్దికెర 27.6,వెల్దుర్తి 23.4,నందవరం 21.8,దేవనకొండ20.6,ఆస్పరి 20.0 హోళగుంద 16.4, కౌతాళం16.2, పత్తికొండ 15.4, ఆదోని 14.2, క్రిష్ణగిరి 13.8, సి బెళగల్ 12.6, పెద్దకడుబూరు 10.4 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయింది.

ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

సాధారణ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించాలని అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎస్‌పిలను సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీష్ వ్యాస్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అదేశించారు. సోమవారం ఢిల్లీలోని కేంద్ర ఎన్నికల కమిషన్ కార్యాలయం నుండి ఎన్నికల కౌంటింగ్ నిర్వహణపై అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎస్‌పిలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీష్ వ్యాస్ సమీక్ష నిర్వహించారు. అంతకుముందు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.సృజన అన్ని నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో మాట్లాడుతూ స్ట్రాంగ్ రూమ్‌ను ఓపెన్ చేయడానికి కార్పెంటర్, ఎలక్ట్రీషియన్‌ను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సిబ్బందిని కౌంటింగ్ కేంద్రాలకు తీసుకెళ్లేందుకు అవసరమైన బస్సులను నిర్దేశించిన సమయంలో కలెక్టరేట్ వద్ద ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎన్నికల విభాగ సూపరింటెండెంట్‌ను అదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్‌పి జి.కృష్ణ కాంత్, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

నేడు సాధారణ సెలవు దినం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నిర్వహిస్తున్న నేపథ్యంలో మంగళవారం స్థానిక సాధారణ సెలవుదినంగా ప్రకటిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.సృజన సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం సాధారణ స్థానిక సెలవు దినం అన్నిటికి వర్తిస్తుందని వెల్లడించారు.

మాట్లాడుతున్న కర్నూలు కాంగ్రెస్ అభ్యర్థి జిలానీ బాష

కౌంటింగ్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఎన్నికల కౌంటింగ్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని కర్నూలు కాంగ్రెస్ అభ్యర్థి జిలాని బాష డిసిసి కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్ అనంతరత్నం పేర్కొన్నారు. సోమవారం కర్నూలు డిసిసి కార్యాలయంలో కాంగ్రెస్ ఎన్నికల కౌంటింగ్ ఏజెంట్లతో వారు సమావేశం నిర్వహించారు. కౌంటింగ్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండి రేపు జరిగే ఎన్నికల కౌంటింగ్‌లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల తరుపున కూర్చునే ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎలాంటి అనుమానాలు వచ్చినా అధికారులకు తెలియ చేయాలన్నారు. ఎన్నికల నిబంధనలు పాటించాలని ఉదయం ఆరు గంటల లోపు కౌంటింగ్ హాలుకు వెళ్లాలన్నారు. ఈ సమావేశంలో ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు బి.బతుకన్న, కాంగ్రెస్ ఎస్‌పి సెల్ జిల్లా చైర్మన్ ఇ లాజరస్, సిటీ మైనార్టీ సెల్ చైర్మన్ షేక్ ఖాజా, హుస్సేన్ , కౌంటింగ్ ఏజెంట్లు పాల్గొన్నారు.

కౌంటింగ్ ఏర్పాట్లకు సర్వం సిద్ధం

-జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి. సృజన
-జిల్లాలో 144 సెక్షన్ అమలు-జిల్లా ఎస్‌పి కృష్ణ కాంత్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాయలసీమ యూనివర్సిటీలో మంగళవారం జరిగే, కౌంటింగ్‌కు ఏర్పాట్లు సర్వం సిద్ధం చేశామని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి డాక్టర్ జి.సృజన పేర్కొన్నారు. సోమవారం రాయలసీమ యూనివర్సిటీలోని మీడియా సెంటర్‌లో కౌంటింగ్ ఏర్పాట్లపై ఎస్‌పితో కలిసి జిల్లా జి ఎన్నికల అధికారి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 4న జరగనున్న కౌంటింగ్ కోసం సంబంధించి కౌంటింగ్ హాలులో ఏర్పాట్లు, కౌంటింగ్ సిబ్బందికి ఇచ్చే శిక్షణ తరగతులు విషయంలో కావచ్చు, రాయలసీమ యూనివర్సిటీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్, కమ్యూనికేషన్ సెంటర్, అబ్జర్వర్ల సీటింగ్, మొబైల్ డిపాజిట్ సెంటర్ ఏర్పాటు, మెడికల్ క్యాంప్ ఏర్పాటు, ఎలక్ట్రిక్ కనెక్షన్స్ ఏర్పాటు, ఎమర్జెన్సీ ఎగ్జిట్ సిస్టం, ఫైర్ సేఫ్టీ, సిసి కెమెరాల ఏర్పాటు ఈ విధంగా కౌంటింగ్ హాల్ లోపల చేయాల్సిన ఏర్పాట్లు, కౌంటింగ్ హాల్ బయట చేయాల్సిన ఏర్పాట్లు అన్ని పూర్తి చేసుకున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి హాలులో రౌండ్ అయిపోయిన తర్వాత కౌంటింగ్ హాల్ నుంచి వచ్చిన ఇన్ఫర్మేషన్ మీడియా వారికి తెలియచేయడానికి తగిన చర్యలు తీసుకున్నామన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతమైన వాతావరణంలో కౌంటింగ్ చేయడానికి , సెక్యూరిటీ పరంగా తీసుకోవాల్సిన అన్ని రకాల చర్యలను జిల్లా ఎస్‌పి తీసుకున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యం, ప్రజాస్వామ్యంలో ప్రజలు ఎన్నుకున్న వాళ్ళు ప్రభుత్వంలో ఉంటారని, ప్రశాంతతకు భంగం కలిగించకుండా ప్రజల నిర్ణయాన్ని గౌరవిస్తూ ఎన్నికల ప్రక్రియని పూర్తి చేయటంలో అందరూ కూడా సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. జిల్లా యంత్రాంగం, పోలీసుల సమిష్టి కృషితో పోలింగ్‌కు ముందు, పోలింగ్ తర్వాత ప్రశాంత వాతావరణం ఉందని, కౌంటింగ్ తర్వాత కూడా ప్రశాంతంగా ఉండేందుకు శాయశక్తులా తాము ప్రయత్నం చేస్తామని, ప్రజలు కూడా సహకరించాలని కలెక్టర్ కోరారు. 4న రాయలసీమ యూనివర్సిటీ చుట్టుపక్కల రెండు కిలోమీటర్ల పరిధిలో అన్ని కమర్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్, షాపులని మూసివేయడం జరుగుతుందన్నారు. శాంతిభద్రతలను కాపాడటంలో భాగంగా 144 సెక్షన్ అమలులో ఉంటుందని కలెక్టర్ తెలిపారు. జిల్లా ఎస్‌పి జి.కృష్ణకాంత్ మాట్లాడుతూ జిల్లాలో కౌంటింగ్ జరుగుతున్న నేపథ్యంలో అంతటా 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కౌంటింగ్ రోజున ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పకడ్బందీగా భద్రత పరంగా తీసుకోవాల్సిన అన్ని రకాల చర్యలను తీసుకున్నామన్నారు. రెండు రకాల బందోబస్తు ఏర్పాటు చేసుకున్నామని, కౌంటింగ్ సెంటర్ వద్ద ఒక బందోబస్తు, కర్నూలు జిల్లాలో సబ్ డివిజన్, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా మరొక బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల కమిషన్ గైడ్‌లైన్స్ ప్రకారం 4 అంచెల భద్రత కౌంటింగ్ హాల్ వద్ద ఏర్పాటు చేశామని ఎస్పీ పేర్కొన్నారు. స్ట్రాంగ్ రూమ్ నుండి కౌంటింగ్ హాల్‌కు వెళ్ళే ప్రతి ఒక్క ఇవిఎం కు కూడా ఎఆర్ ఎస్కార్ట్ ఉంటుందన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది, కౌంటింగ్ ఏజెంట్ కాకుండా ఏ ఇతర వ్యక్తులు కూడా కౌంటింగ్ సెంటర్‌లోకి ప్రవేశించకుండా 3 కట్‌ఆఫ్ సెక్యూరిటీ పాయింట్లను ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది, కౌంటింగ్ ఏజెంట్ వాహనాలను కౌంటింగ్ హాల్‌కు 200 మీటర్ ప్రాంగణంలో వెహికల్స్‌పార్క్ చేయించి, మొబైల్ డిపాజిట్ చేసిన అనంతరం ఎఆర్ పోలీస్ టీమ్స్ మరల ఒక్కసారి చెక్ చేసి కౌంటింగ్ హాల్‌లోకి పంపిస్తారన్నారు. కర్నూలు జిల్లాలో 144 సెక్షన్, సెక్షన్ 30 యాక్ట్ ఆఫ్ పోలీస్ అమలులో ఉందనే విషయం గురించి పలుమార్లు పబ్లిసిటీ కూడా చేశామన్నారు. కర్నూలు జిల్లా ముఖ్యమైన జంక్షన్‌లతో పాటు, పల్లెలో కూడా 144 సెక్షన్, సెక్షన్ 30 యాక్ట్ ఆఫ్ పోలీస్ గురించి ప్రచారం చేయిస్తున్నామన్నారు. ట్రబుల్ మాంగర్స్ అందరిని ఐడెంటిఫై చేసి వారి మూమెంట్ ని కూడా ట్రాక్ చేస్తున్నామన్నారు. గెలిచిన వారు ఎవరు కూడా ఫైర్ క్రాకర్స్, విక్టరీ మార్చ్ నిర్వహించేందుకు అనుమతులు లేవని తెలిపారు. సమాచార పౌర సంబంధాల అధికారి జయమ్మ, బిసి సంక్షేమ అధికారి వెంకట లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

మీడియాతో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.సృజన , ఎస్‌పి కృష్ణకాంత్

పర్లలో భారీ వర్షం

ఇళ్లల్లోకి చేరిన వరదనీరు

చౌక ధరల దుకాణం లో వరద నీటిలో తడిసిన 30 ప్యాకెట్ల రేషన్ బియ్యం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : కల్లూరు మండలం పర్ల గ్రామ పరిసర ప్రాంతాలలో రాత్రి భారీ వర్షం కురిసింది. పొలాల్లో నిలిచిన వర్షం నీరు పొలం గట్లను తెంచుకొని గ్రామంలోకి వరద నీరు చేరుకుంది. ఒక్కసారిగా వరద నీరు గ్రామ వీధుల్లో ప్రవహించడంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. లోతట్టు ప్రాంత ఇళ్లల్లోకి, మామూలు ఇళ్లల్లోకి వరద నీరు వచ్చి చేరింది. అందులో భాగంగా డీలర్ మహానందికి చెందిన చౌక ధరల దుకాణంలోకి వర్షం నీరు చేరి 30 ప్యాకెట్ల రేషన్ బియ్యాన్ని తడిపేసింది. రెవెన్యూ అధికారుల దృష్టికి డీలర్ మహానంది తీసుకుపోయానని చెప్పారు. రేషన్ కార్డుదారులకు తడిసిన బియ్యం పంపిణీ చేయలేక ఏమి చేయాలో దిక్కు తోచడం లేదని డీలర్ మహానంది వాపోయారు. రెవెన్యూ అధికారులు చౌక ధరల దుకాణాన్ని సందర్శించి తగిన న్యాయం చేయాలని డీలర్ కోరారు. గ్రామంలోని లోతట్టు ఇళ్లల్లోకి వరద నీరు చేరడంతో అనేక ఇల్లు నీట మునిగాయి. ఇళ్లల్లో నిలువ ఉంచుకున్న ఆహార ధాన్యం తడిసిపోయాయి బట్టలు, వంట సామాగ్రి కొట్టుకుపోయాయని బాధితులు వాపోయారు. అధికారులు సందర్శించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

జిజిహెచ్‌లో ఇసిజి మిషన్‌ను రిబ్బన్‌కట్‌చేసి ప్రారంభిస్తున్న సి ప్రభాకర్‌రెడ్డి

న్యూ డయాగ్నోస్టిక్స్ బ్లాకులో ఇసిజి మిషన్ ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల న్యూడయాగ్నోస్టిక్ బ్లాక్‌లో ఇసిజి మిషన్‌ను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల న్యూ డయాగ్నోస్టిక్ బ్లాక్‌లో ఇసిజి మిషన్ ప్రారంభించడం ద్వారా పేషెంట్లకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నట్లు తెలిపారు. ఆసుపత్రి అత్యవసర విభాగంలోని (క్యాజువాలిటీ) మరొక ఇసిజి మిషన్ అందుబాటులో ఉంచిన్నట్టు తెలిపారు. ఆసుపత్రిలోని న్యూ డయాగ్నస్టిక్ బ్లాక్ లోని అన్ని సేవలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఎఫ్ ఆర్ఎంఓ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఎఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, న్యూ డయాగ్నోస్టిక్ బ్లాక్ ఇన్‌ఛార్జి డాక్టర్ సునీల్ ప్రశాంత్, హాస్పిటల్ అడ్మిట్ స్టేటస్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ డాక్టర్ శివబాల నగాంజన్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు బెల్టులు ప్రదానం చేసిన టిజి.వెంకటేష్

తైక్వాండో క్రీడాకారులకు బెల్టులు ప్రదానం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

టిజి వెంకటేష్ నివాసంలో టిజివి స్పోర్ట్స్ తైక్వాండో అకాడమీ క్రీడాకారులకు టిజివి నివాసంలో తైక్వాండో కలర్ బెల్టులు అందజేశారు. అనంతరం పౌష్టికాహారం అందజేశారు. రాజ్యసభ మాజీ సభ్యులు టిజి.వెంకటేష్ మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులు రోజు ఆత్మరక్షణ క్రీడా తైక్వాండో శిక్షణ పొందుతూ ఆరోగ్యమే మహాభాగ్యంగా చురుకుదనంగా ఉంటారన్నారు. పిల్లల ఎదుగుదలకు తల్లిదండ్రులు క్రీడల పట్ల శ్రద్ధ చూపిస్తున్నారని అన్నారు. తమ పిల్లలు టిజివి, టిజివి స్పోర్ట్స్ అకాడమీలో రోజు శిక్షణ తీసుకున్నందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. ఇలాంటి క్రీడలకు టిజి. వెంకటేష్, టిజి.భరత్ ఎటువంటి సహాయ సహకారాలయినా అందిస్తారన్నారు. శిక్షకులు టి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తైక్వాండో క్రీడా ఒలంపిక్ క్రీడా, డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ వారి ఈ క్రీడ నేర్చుకున్న విద్యార్థులు జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో యూనివర్సిటీలో కూడా రాణిస్తున్నారని తెలిపారు. తైక్వాండో శిక్షకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆనంద్ బాబు

28, 29న సామాజిక శిక్షణ తరగతులు

- విజయవంతం చేయండి

- కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్‌బాబు

ప్రజాశక్తి - ఆదోని

ఈనెల 28, 29న ఆదోనిలో జరిగే సామాజిక చైతన్య శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.ఆనంద్ బాబు, జిల్లా మాజీ ఉపాధ్యక్షులు పిఎస్.గోపాల్, మండల అధ్యక్ష, కార్యదర్శులు సి.మునిస్వామి, బి.తిక్కప్ప కోరారు. సోమవారం ఆదోనిలోని సిఐటియు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కడితోట దావీదు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఏళ్ల తరబడి దళితులు ఆర్థిక, సామాజిక సమానత్వానికి నోచుకోక ఇబ్బందులు ఎదుర్కుంటూనే ఉన్నారని తెలిపారు. ఎస్సీ ప్రజాప్రతినిధులకు సైతం ఆ బాధలు తప్పడం లేదన్నారు. సామాజిక తరగతుల మధ్య ఐక్యత, చైతన్యం, పోరాటం ద్వారా మాత్రమే వాటిని తిప్పికొట్టగలమని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాల వరకు ఉన్న సామాజిక ఉద్యమకారులందరినీ సమీకరించి ఈనెల 28, 29న ఆదోనిలో సామాజిక చైతన్య శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామన్నారు. కెవిపిఎస్ పట్టణ నాయకులు మల్లికార్జున, యువరాజు, మండల నాయకులు లక్ష్మన్న, చక్రవర్తి, తాయన్న, రామాంజనేయులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

- ఇఒఆర్‌డి బాలన్న

ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఇఒఆర్‌డి బాలన్న, ఎఎన్‌ఎం సువర్ణ

ప్రజాశక్తి - చిప్పగిరి

వర్షాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునే బాధ్యత అందరిపైనా ఉందని ఇఒఆర్‌డి బాలన్న, సచివాలయ ఎఎన్‌ఎం సువర్ణ తెలిపారు. సోమవారం నేమకల్లు పంచాయతీ మజరా గ్రామమైన సంగాలలో పరిసరాల పరిశుభ్రతపై పలు వీధుల్లో ఉన్న మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు గ్రామంలో దేవర ముగిసి 15 రోజులవుతున్నా వీధులు అపరిశుభ్రతతో నిండిపోయాయని తెలిపారు. పరిసరాలను ఇప్పటికీ మూడుసార్లు శుభ్రం చేయించినా మహిళలు మళ్లీ చెత్తాచెదారం వేసి ఈగలు, దోమలు వ్యాప్తి చెందేలా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటి చుట్టూ పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే దోమలు, ఈగలు వ్యాప్తిం చెందుతాయని తెలిపారు. అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని చెప్పారు. ఈ వాస్తవాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకొని ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అది అందరి బాధ్యతగా భావించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మహిళలను కోరారు.

ఫెర్టిలైజర్ లైసెన్స్ రద్దు చేస్తాం

- పత్తికొండ ఎడిఎ

ప్రజాశక్తి - పత్తికొండ

నకిలీ విత్తనాలు, పిచికారి మందులు అమ్మితే ఫెర్టిలైజర్ లైసెన్స్ రద్దు చేస్తామని పత్తికొండ ఎడిఎ మోహన్ విజయ కుమార్ హెచ్చరించారు. సోమవారం పత్తికొండ వ్యవసాయ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఈఏడాది వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని తెలిపారు. రైతులు పొలాల్లో జూన్ 15 నుంచి విత్తనాలు వేసుకోవచ్చని చెప్పారు. ఆర్‌బికెలలో వేరుశనగ విత్తనాలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. లైసెన్స్ కలిగిన ఫెర్టిలైజర్ షాపు డీలర్లు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు ఎరువులను, మందులు అమ్మాలన్నారు. రైతులు ఏవైనా మందులు కొనుగోలు చేసిన వెంటనే రసీదు తప్పనిసరిగా తీసుకోవాలని అన్నారు. ఫెర్టిలైజర్ షాపు డీలర్లు రైతులను మోసం చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తుంగభద్ర డ్యామ్‌కు

700 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

ప్రజాశక్తి - హోళగుంద

కర్ణాటక రాష్ట్రం శివమొగ్గ, ధవనగిరి, రాణి బెన్నూర్, తదితర ప్రాంతాల్లో గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు తుంగభద్ర డ్యామ్‌కు రోజుకు 700 క్యూసెక్కుల ప్రకారం ఇన్‌ఫ్లో వస్తున్నట్లు బోర్డు అధికారులు సోమవారం తెలిపారు. ప్రస్తుతం తుంగభద్ర డ్యామ్‌లో 3 టిఎంసిలు నీరు మాత్రమే ఉంది. ఈ రెండు, మూడు రోజుల్లో రుతుపవనాల కారణంగా మంచి వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలపడంతో ఇన్‌ఫ్లో మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. గతేడాది మే, జూన్ నెలలో ఎలాంటి ఇన్‌ఫ్లో ఉండేది కాదు. ఈ ఏడాది జూన్ నెలలో ఇన్‌ఫ్లో మొదలు కావడంతో త్వరలో డ్యామ్‌లోకి నీరు చేరే అవకాశాలు ఉన్నట్లు అధికారులు చర్చించుకుంటున్నారు. తుంగభద్ర డ్యామ్, ఎల్‌ఎల్‌సి కాలువపై ఆధారపడిన రైతులు తమ పొలాల్లో దుక్కులు మొదలుపెట్టారు. గతేడాది వర్షాలు లేక బెంగళూరు, ముంబాయి వంటి ప్రాంతాలకు రైతులు వలస వెళ్లారు. ఇలాంటి రైతులు సైతం గ్రామాలకు వచ్చి చేరుకొని తమ తమ పొలాల్లో పనులు చేసుకుంటున్నారు.

వేదవతికి వరద నీరు : ఆంధ్ర, కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో మార్లమడికి గ్రామానికి ఆనుకొని ప్రవహిస్తున్న వేదవతి హగరినదికి వరద నీరు వచ్చి చేరుతోంది. ఆదివారం రాత్రి ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు వరద నీరు వచ్చి చేరింది. నాలుగు అడుగుల మేర నీరు వరద రూపంలో పారుతోంది. రోహిణి కార్తీలో వర్షాలు కురవడంతో పంట పొలాలను చదును చేసుకున్న రైతులు పత్తి, పొద్దుతిరుగుడు వంటి విత్తనాలు పెట్టారు, మండలంలో 16.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయినట్లు అధికారులు తెలిపారు.

మార్లమడికి గ్రామం వద్ద వేదవతి నదిలో వరద నీరు

అలరించిన సంగీత కచేరి

ప్రజాశక్తి - ఆలూరు

మండలంలోని కమ్మరచేడు గ్రామంలో సంగీత కచేరి అలరించింది. గ్రామంలో కొలువైన శ్రీకాడ సిద్ధేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్టాపన చేసి 41వ రోజులు పూర్తయినందున గ్రామంలోని భక్తులు అర్చకులతో శాస్త్రోక్తంగా మండల పూజ దిగ్విజయంగా నిర్వహించారు. సోమవారం యోగి పంచాక్షరి గవాయి శిష్యులు సిరుగుప్ప తాలూకా రావాళు గ్రామ నివాసితులైన హుచ్చయ్య స్వామి హిరేమఠ, వీరేశ స్వామి హిరేమఠ బృందం తరపున సంగీత కచేరి ఏర్పాటు చేశారు. పుట్టుకతో వీరు అంధులైనా తమ అద్భుతమైన గాత్రంతో భక్తి పాటలు పాడి అందరినీ మంత్రముగ్ధుల్ని చేసి, తమ సంగీత కచేరితో అందరినీ అలరించారు.

పాటలు పాడుతున్న కళాకారులు

లాడ్జీల నిర్వాహకులకు నోటీసులు

- ఎస్ఐ గోపీనాథ్

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని ప్రయివేట్ లాడ్జీల నిర్వాహకులకు నోటీసులు జారీ చేసినట్లు ఎస్ఐ గోపీనాథ్, ఎఎస్ఐ ఆనంద్ రెడ్డి తెలిపారు. సోమవారం వారు మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ఉన్నందున శాంతిభద్రతల పరిరక్షణకు ముందస్తు చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. లాడ్జీల్లో వివిధ పార్టీల నాయకులు గదులు తీసుకొని మద్యం, మాంసం వంటి అసాంఘిక కార్యకలాపాలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. లాడ్జీల నిర్వాహకులు వివిధ పార్టీలకు చెందిన వారికి గదులు ఇవ్వకూడదని తెలిపారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పోలీసు స్టేషన్ పరిధిలో గల గ్రామాల్లో ఎవరైనా మద్యం సేవించి గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు సహకరించాలని కోరారు.

కార్యాలయ ఆవరణలో నిలిచిన వర్షపు నీరు

అపరిశుభ్రత..!

- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఆవరణలో వర్షపు నీరు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

ఎమ్మిగనూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అపరిశుభ్రత నెలకొంది. వర్షాలు కురవడంతో వెళ్లేందుకు దారి లేక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నిండా నీరు నిలిచాయి. రిజిస్టర్ కోసం వచ్చిన రైతులకు ఇబ్బందికగా మారింది. కార్యాలయం ఆవరణలో వర్షపు నీరు నిండి ఉండడంతో రైతులు ఈకేవైసీ చేసే ముందు వెళ్లాల్సి వచ్చింది. ఈకేవైసీ చేసుకుంటున్న వ్యక్తులతో రద్దీగా ఉండడంతో లోపలికి రావడానికి, బయట వెళ్లడానికి ఇబ్బందిగా మారింది. దానికి తోడుగా ద్విచక్ర వాహనాలు కార్యాలయం లోపల నిండిపోవడంతో ప్రజలకు అవస్థలు తప్పలేదు. అధికారులు మాత్రం చలనం లేకుండా ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు. తమకు ఈ తిప్పలు తప్పేటట్టు లేవని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చిన రైతులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఈకేవైసీ దగ్గర గుమికూడిన జనం

శ్రీమఠంలో రాఘవేంద్రుని నిజ బృందావన దర్శనం

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో రాఘవేంద్రుని నిజ బృందావన దర్శన భాగ్యం భక్తులకు కల్పించారు. సోమవారం ఏకాదశీ తిథి సందర్భంగా రాఘవేంద్రుని బృందావనాన్ని నిర్మాల్యం చేసి తులసి అర్చనతో కాషాయ వస్త్రాలతో తులసి మాలతో అందంగా అలంకరించారు. ఏకాదశీ తిథి కావడం వల్ల స్వామి వారికి నైవేద్య సమర్పణ లేకపోవడంతో భక్తులకు కూడా భోజన సదుపాయం, పరిమళ ప్రసాద విక్రయం నిలిపివేయడం సాంప్రదాయం.

సంయమనం పాటించాలి

- నూర్ అహ్మద్

ప్రజాశక్తి - ఆదోని

ఓట్ల లెక్కింపు, ఫలితాల విడుదల సందర్భంలో రాజకీయ నాయకులు, కార్యకర్తలు సంయమనం పాటించి ఆంధ్రప్రదేశ్ మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర సెక్రటరీ ఎ.నూర్ అహ్మద్ కోరారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పే అంతిమ తీర్పు అని తెలిపారు. ఎన్నికల ఫలితాలు ఎలా ఉన్నా ప్రజా తీర్పును అందరూ గౌరవించాలన్నారు. గెలుపోటములు ఎన్నికల్లో సహజమని తెలిపారు. గెలిచిన వారు, ఓడిపోయిన వారు రాబోయే రోజుల్లో ప్రజా సంక్షేమం కోసం పాటు పడేందుకు ప్రతిజ్ఞ చేయాలని కోరారు. గొడవలను గమనించినా, హింసాత్మక సంఘటనలు జరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం ఉన్నా ప్రజలు, రాజకీయ పార్టీల వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఎన్నికల్లో ఏ పార్టీ గెలిచినా రాబోయే రోజుల్లో రాష్ట్ర ప్రజలకు, ఆదోని ప్రాంత ప్రజలకు మేలు చేయాలని కోరుకుందామని చెప్పారు.

అమ్మ ఆస్పత్రి వద్ద రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

డ్రెయినేజీ అస్తవ్యస్తం

- రోడ్లపైనే మురుగునీరు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి అస్తవ్యస్తంగా ఉన్న మురుగు కాలువల వల్ల మురుగునీరు రోడ్లపై చేరి లక్ష్మీ నగర్, శ్రీరామ్ నగర్ ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ప్రధానంగా రామకృష్ణ పాఠశాల, పాలకొట్టాలు, లక్ష్మీ నగర్, శ్రీరామ్‌నగర్ కలిసే రోడ్లపై మురుగునీరు నిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. సోమవారం ఉదయం ఆ ప్రాంతాల్లోని ప్రజలు రోడ్లపై తిరిగేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షం పడిన ప్రతిసారీ ఇలాంటి పరిస్థితి నెలకొంటుంది. అధికారులు వర్షం పడినప్పుడు వచ్చి చూసినట్లయితే వాస్తవం తెలుస్తుంది. అలాకాకుండా వర్షపు నీరు తగ్గిపోయిన తర్వాత వచ్చి చూడడం, ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశాలు ఇవ్వడం పరిపాటిగా మారిందని ప్రజలు విమర్శిస్తున్నారు. అధికారులు తాత్కాలిక పనులు చేస్తున్నారు తప్ప శాశ్వతమైన పనులు చేయడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు. అస్తవ్యస్తంగా నిర్మించిన మురుగు కాలువల వల్లనే ఈ పరిస్థితి నెలకొందని ప్రజలు చెబుతున్నారు. శాశ్వత పరిష్కారం చూపి వర్షాకాలంలో లక్ష్మీ నగర్, శ్రీరామ్ నగర్ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా చేయాలని కోరుతున్నారు. అలాగే సిక్యాంపు సమీపంలోని అమ్మ ఆస్పత్రి దగ్గర రోడ్లపై నీళ్లు నిలిచి ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నగర శివారు ప్రాంతాల్లో రోడ్లు లేక మట్టి రోడ్లలో బురద నిలిచి ఉండడంతో ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షం పడిన వెంటనే అధికారులు నగరమంతా ఎవరి ప్రాంతంలో వారు తిరిగి చూసి నీరు నిలవకుండా కాలువల్లోకి వెళ్లే విధంగా ఏర్పాట్లు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

6 వరకు 144 సెక్షన్

- నిబంధన అతిక్రమిస్తే రౌడీషీట్ ఓపెన్

- డీఎస్పీ శివ నారాయణ స్వామి

ఆదోనిలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

సమావేశంలో మాట్లాడుతున్న సిఐ హనుమంతప్ప

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలో ఈనెల 6 వరకు ఐపిసి 144 సెక్షన్, 30 పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని, ప్రజలు సహకరించాలని ఆదోని డీఎస్పీ శివ నారాయణ స్వామి కోరారు. సోమవారం ఆదోని టూ టౌన్ పోలీసు స్టేషన్ నుంచి ఎంఎం రోడ్, పిఎన్ రోడ్, గణేష్ సర్కిల్, గోల్డ్ బజార్, తిక్క స్వామి దర్గా, కొత్తబస్టాండ్ రోడ్డు ప్రాంతాల గుండా కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ జరగకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. లూజు పెట్రోలు విక్రయం చేయరాదని, ఇప్పటికే పెట్రోల్ బంక్ యజమానులకు సూచించామని తెలిపారు. రాజకీయ పార్టీలకు సంబంధించిన ఫంక్షన్లు, సంబరాలు జరుపుకునేలా యజమానులు అనుమతి ఇవ్వరాదన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే ఫంక్షన్ హాల్స్ పర్మిషన్ రద్దు చేయిస్తామని హెచ్చరించారు. గుర్తింపు కార్డు కలిగి ఉన్న వారికి మాత్రమే లాడ్జిల్లో రూము ఇవ్వాలని తెలిపారు. ఎవరైనా అనుమానిత వ్యక్తులు సంచరిస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఇప్పటికే లాడ్జిల యాజమానులకు, నిర్వాహకులకు సూచించామని చెప్పారు. ఎన్నికల ఫలితాలు వెలవడిన నేపథ్యంలో ఎలాంటి ఊరేగింపులూ చేరాదన్నారు. బాణసంచా కాల్చినా, సంబరాలు చేసుకున్నా ఆ పార్టీ నాయకులపై కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు. నలుగురికి మించి గుంపులు ఉండరాదని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కల్పించిన వారిపై రౌడీషీట్ ఓపెన్ చేయిస్తామన్నారు. ఆదోని ప్రశాంతతకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ట్రెయినీ డీఎస్పీ ధీరజ్ శ్రీధర్, సిఐలు గోపి, తేజోమూర్తి, విజయలక్ష్మి, పోలీసులు ఉన్నారు.

కోడ్‌ను ఉల్లంఘిస్తే చర్యలు : సిఐ

ప్రజాశక్తి - ఆస్పరి

ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని ఆస్పరి సిఐ హనుమంతప్ప హెచ్చరించారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లో అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మంగళవారం జరిగే ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా గ్రామాల్లో గొడవలు, డిజె, బాణసంచా, సభలు, ర్యాలీలు వంటి కార్యకలాపాలకు పాల్పడితే రౌడీషీట్ కేసు నమోదు చేసి, రూ.2 లక్షల జరిమానా విధిస్తామని తెలిపారు. ఎన్నికల కోడ్ ఉన్నంత వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని చెప్పారు. 30 పోలీసు యాక్ట్ అమలులో ఉందని తెలిపారు. రోడ్లపై నలుగురి కంటే ఎక్కువ మంది తిరగరాదని హెచ్చరించారు. ఈనెల 5 వరకు డ్రై డ్రే అమలులో ఉంటుందని, మద్యం సేవించి రెచ్చగొట్టేలా ఎవరూ వ్యవహరించ వద్దని పేర్కొన్నారు.

మాట్లాడుతున్న నందవరం ఎస్ఐ తిమ్మయ్య

గ్రామాల్లో ప్రశాంతంగా ఉండాలి : ఎస్ఐ

ప్రజాశక్తి - నందవరం

అసెంబ్లీ ఎన్నికల్లో ఏ పార్టీ గెలిచినా ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రశాంతంగా ఉండాలని, గొడవలు సృష్టిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ పి.తిమ్మయ్య హెచ్చరించారు. సోమవారం నందవరం బస్టాండ్‌లో గ్రామస్తులతో మాట్లాడారు. ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా గ్రామాల్లో 144 సెక్షన్ అమలులో ఉందని, గుంపులుగా ఉంటే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఏ పార్టీ నాయకులైనా, కార్యకర్తలైనా గెలుపోటములను సమానంగా చూడాలని తెలిపారు. గెలిచిన వారు సంబరాలకు పోయి, ఓడిన వారిపై దాడులు చేస్తే కఠినంగా శిక్షలు విధిస్తామన్నారు. దాడులకు పాల్పడిన వారిపై బైండోవర్ కేసు నమోదు చేస్తే, వారి జీవితాలు నాశనం అవుతాయని తెలిపారు. ప్రజలందరూ స్వచ్ఛందంగా ఎన్నికల ఫలితాలను ఒకరోజు రాజకీయంగా చూసి వదిలివేయాలన్నారు. తర్వాత రోజు కూడా సంబరాలకు ఎలాంటి అనుమతులూ లేవని తెలిపారు. గ్రామాల్లో బాణసంచా కాల్చడం, ఊరేగింపులు, డిజెలు పెట్టడం చేయరాదన్నారు. ఎన్నికల ముందు ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో ఎన్నికల తర్వాత కూడా అంతే ప్రశాంతంగా ఉండాలని తెలిపారు. ఎన్నికల ఫలితాలను దృష్టిలో పెట్టుకొని ఒకరిపై ఒకరి దాడులు, మనస్పర్థలు పెంచుకుని గొడవలకు దిగితే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు.

బండలాగుడు పోటీల్లో

విజేత కొత్తకోట వృషభాలు

ప్రజాశక్తి- దేవనకొండ

మండలంలోని పి.కోటకొండ గ్రామంలో హనుమాన్ జయంతి ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి పాల పండ్ల వృషభాల బండలాగుడు పోటీల్లో నంద్యాల జిల్లా కొత్తకోట గ్రామానికి చెందిన గురునాథ్ వృషభాలు విజేతగా నిలిచాయి. బండలాగుడు పోటీలకు వ్యాఖ్యాతగా యామారెడ్డి వ్యవహరించారు. ఈ పోటీల్లో విజేతగా నిలిచిన వృషభాలకు రూ.30 వేలను దాత ఈదుల దేవరబండ సుభాన్ సోమవారం అందించారు. ద్వితీయ బహుమతి ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన సుధాకర్, జరదొడ్డి గ్రామానికి చెందిన భీమారెడ్డి వృషభాలకు రూ.20 వేలు పచ్చి రాయి కొట్టేవారు అందించారు. తృతీయ బహుమతి రుద్రవరం గ్రామానికి చెందిన రాముడు, గోపాల్ గౌడ్ వృషభాలకు మల్లెపల్లి సుంకన్న రూ.10 వేలు అందించారు. నాలుగో బహుమతి కోడుమూరు మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన రామేశ్వర్ రెడ్డి వృషభాలకు రూ.5 వేలు పచ్చి రాయి కొట్టేవారు అందించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సహకారం అందించిన పోలీసులకు భక్త యోగాంజనేయ స్వామి ఆలయ వ్యవస్థాపకులు యోగేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు, పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అర్హత కలిగిన

ప్రతి రైతూ పండ్ల తోటలు పెంచాలి

- ఎంపిడిఒ రామారావు

ప్రజాశక్తి - పత్తికొండ

ఉపాధి హామీ చట్టం కింద అర్హత కలిగిన ప్రతి రైతూ పండ్ల తోటలను విరివిగా పెంచుకోవాలని ఎంపిడిఒ రామారావు తెలిపారు. సోమవారం ఎంపిడిఒ కార్యాలయంలో ఉపాధి హామీ, హార్టికల్చర్ సిబ్బందితో ఎపిఒ వెంకటేశ్వర్లు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపిడిఒ రామారావు హాజరై మాట్లాడారు. ఉపాధి హామీ చట్టం కింద జాబ్ కార్డు కలిగి 5 ఎకరాల్లోపు భూమి కలిగిన రైతులు ఎవరైనా ఈ పథకం కింద పండ్ల తోటలు పెంచుకోవటానికి అర్హులని తెలిపారు. ఈ పథకం కింద మామిడి, జామ, సపోటా, నిమ్మ, నారింజ, దానిమ్మ వంటి 15 రకాల పండ్ల తోటలు, గులాబీ, మల్లె వంటి పూలతోటలు, మునగ వంటి త్వరగా ఆదాయాన్నిచ్చే పంట రకాలను 100 శాతం రాయితీతో అందిస్తున్నామని చెప్పారు. దీనికి పంట రకాన్ని బట్టి మొక్క నాటడం, గుంతలు తీయడం, ఎరువులు పెట్టడం, నీటిని అందించడం, మొక్కలను సంరక్షించడం వంటి వాటికి 3 సంవత్సరాల వరకు మెయింటనెన్స్ ఉంటుందని తెలిపారు. నీటివసతి కలిగిన వారు, వర్షాధార రైతులు కూడా ఈ పథకానికి అర్హులేనని చెప్పారు. దీనిద్వారా రైతులు ఆర్థికాభివృద్ధి చెందుతారని తెలిపారు. అలాగే పర్యావరణ పరిరక్షణ కూడా జరుగుతుందని చెప్పారు. జాబ్‌కార్డు కలిగి 5 ఎకరాల్లోపు భూమి ఉన్న ప్రతి రైతూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జెఇ జిలాని, ప్లాంటేషన్ సూపర్‌వైజర్ ఎ.రత్నం పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ రామారావు